RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**28న బక్రీద్ సెలవు** 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 117 | మే 24 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 117 | May 24 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## రెండో విడతలో 2.5 లక్షల
# ఇందిరమ్మ ఇళ్లు

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,**




**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో రెండో విడత కింద రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్లను కేటాయించనున్నారు. అలాగే గత ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో ప్రారంభమై, వివిధ దశల్లో నిలిచిపోయిన పాత ఇందిరమ్మ ఇళ్లను సైతం పూర్తి చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇందుకోసం నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిధులు ఇస్తారు. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబ్ నిలిచిన ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబ్ పడని ఇళ్లకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. మొదటి విడతలో చేపట్టిన ఇళ్లలో దాదాపు లక్ష ఇళ్లకు జూన్ 2 నాటికి గృహప్రవేశాలు చేయించనుండగా.. అంతకంటే ముందే జూన్ 1న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో కొలాం ఆదివాసీల కోసం నిర్మించిన 28 ఇళ్లను సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల బృందం స్వయంగా వెళ్లి ప్రారంభించనుంది.
హైదరాబాద్ మహానగర పరిధిలోని (క్యూఆర్) 24 నియోజకవర్గాల్లో నివసించే అల్పాదాయ వర్గాల కోసం లక్ష ఇళ్లను నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది.

➢ మిగతా 2వ పేజిలో..

## గోదావరి పుష్కరాలకు
# భారీ నిధులు

**రంగంలో కీలక సంస్కరణలు, కొత్త ఉద్యోగాల భర్తీ**



**హైదరాబాద్ జనసంఘర్షణ**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిరుద్యోగులకు, విద్యార్థులకు మేలు చేకూరేలా పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం, ఇందుకు సంబంధించి మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం ఏకంగా రూ.1,000 కోట్ల కేటాయింపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా పనులను వేగవంతం చేసేందుకు తొలి విడత కింద రూ.300 కోట్ల నిధుల విడుదలకు మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. ఈ నిధులతో పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటును ముందస్తుగానే చేపట్టనున్నారు. ఇక విద్యా రంగంలో పేద విద్యార్థులకు అండగా నిలిచేలా కేబినెట్ సరికొత్త నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇకపై మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారికంగా అమలు చేయాలని నిశ్చయించింది. దీనితో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్

➢ మిగతా 2వ పేజిలో..

# మరోమారు పెరిగిన ఇంధన ధరలు

**పది రోజుల్లో మూడోసారి బాదుడు, కొత్త వ్యూహంతో ఆయిల్ కంపెనీలు**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశంలో సామాన్యుడిపై ఇంధన భారం మరింత పెరిగింది. చమురు కంపెనీలు వరుసగా మూడోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. తాజాగా పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసల మేర ధరలను పెంచాయి. గడచిన కేవలం పది రోజుల వ్యవధిలోనే ఈ విధంగా ఇంధన ధరలను పెంచడం ఇది మూడవసారి కావడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ధరల పెంపు ప్రక్రియ వెనుక చమురు సంస్థలు ఒక నిర్దిష్టమైన విధానాన్ని (ప్యాట్రన్) అనుసరిస్తున్నాయనే అంశంపై ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన ఈ పెంపు, ఆ తర్వాత 19న, తాజాగా 23వ తేదీన జరిగింది. అంటే ప్రతి

➢ మిగతా 2వ పేజిలో..




## భారత్-అమెరికా బంధం
# మరింత బలోపేతం

**ప్రధాని మోదీతో యుఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
న్యూఢిల్లీ వేదికగా భారత్, అమెరికాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడ్డాయి. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా భారతదేశానికి వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రధాని నరేంద్ర మోదీతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. 'సేవాతీర్థ్'లో దాదాపు గంటకు పైగా సాగిన ఈ ఉన్నత స్థాయి భేటీలో రక్షణ, వాణిజ్యం, అత్యాధునిక సాంకేతిక రంగాలలో ఇరుదేశాల సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున ప్రధాని మోదీని వైట్‌హౌస్ సందర్శించాల్సిందిగా రూబియో అధికారికంగా ఆహ్వానించారు. తమ దేశానికి భారతదేశం అత్యంత కీలకమైన భాగస్వామి అని పునరుద్ఘాటించిన ఆయన, ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని, ఇప్పటికే భారతీయ కంపెనీలు అమెరికాలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని ప్రశంసించారు.
అంతర్జాతీయ ఇంధన మార్కెట్ మరియు భద్రతా అంశాలపై కూడా ఈ సమావేశంలో

➢ మిగతా 2వ పేజిలో..

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొట్టిన క్రూజర్, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి**

**బెంగుళూరు జనసంఘర్షణ**
కర్ణాటక రాష్ట్రంలో శనివారం ఒక విషాదకరమైన రహదారి ప్రమాదం సంభవించింది. లాడ్లాపూర్ సమీపంలో వేగంగా ప్రయాణిస్తున్న క్రూజర్ వాహనం, తన ముందర వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ భీకర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టి, వివరాలు సేకరించారు. మృతులను క్యాష్వార్, హుస్సేన్, అలీ, రసూల్, ఫాతిమాగా గుర్తించారు. ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో క్రూజర్ వాహనం పూర్తిగా నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

➢ మిగతా 2వ పేజిలో..

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు

- **45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు,**

**హైదరాబాద్/విజయవాడ జనసంఘర్షణ**
తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ మిన్నంటుతోంది. భానుడి ఉగ్రరూపంతో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిప్పుల కుంపటిలా మారాయి. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేసి జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 46.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు తోడు వేడి గాలులు తోడవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
24 ఆదివారం, మే 2026

# రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్రవ్యాప్తంగా వివిధ సర్వేల ద్వారా గుర్తించిన 15 వేల గుడిసెల కుటుంబాలన్నింటికీ తక్షణమే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించి, తెలంగాణను గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. వీటితో పాటు, వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం రూ.1000 కోట్ల నిధులకు కేబినెట్ ఆమోదం తెలపగా.. తొలి విడతగా రూ.300 కోట్లు విడుదల చేయనున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి కేంద్ర పథకంలో చేరేలా డిస్కమ్‌ల ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విద్యా రంగానికి సంబంధించి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు, పాఠశాలలు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం, పాలను పంపిణీ చేయనున్నారు. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్‌లో, అలాగే తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను హాకా (నాబార్డు) లో విలీనం చేయాలని నిర్ణయించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూసేకరణ, పునరావాస పనుల కోసం రూ.587 కోట్లు కేటాయించారు.

మరోవైపు, తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్-5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టే లక్ష్యంతో 'నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30'కి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దావోస్ సదస్సులో లాంఛనంగా ఆవిష్కరించిన ఈ విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సుమారు 5 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని మంత్రులు వివరించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో కేవలం తయారీ పైనే కాకుండా.. విలువైన పరిశోధనలు (ఇన్నోవేషన్) జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (=ఆఖ) యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తిస్తూ మార్పులు చేశామని, దీనివల్ల గ్లోబల్ కేపబిలిటీ, ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని మంత్రివర్గం ఆశాభావం వ్యక్తం చేసింది.

# గోదావరి పుష్కరాలకు భారీ నిధులు

**మొదటిపేజీ తరువాయి..** కాలేజీల్లో చదివే విద్యార్థులందరికీ ఉదయం పూట పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని, పాలను ఉచితంగా అందించేలా సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. రక్షణ రంగానికి సంబంధించి దేశ సరిహద్దులను కాపాడే అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ శిక్షణ కేంద్రాల (సెంటర్ల) ఏర్పాటు కోసం కరీంనగర్ జిల్లాను ఎంపిక చేస్తూ కేబినెట్ తీర్మానించింది. మరోవైపు రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్-టీచింగ్ పోస్టులతో పాటు అవుట్‌సోర్సింగ్ విధానంలో మరో 3 పోస్టుల నియమకాలకు అనుమతినిచ్చింది. వీటితో పాటు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పరిధిలోని కొత్త అగ్నిమాపక కేంద్రానికి (ఫైర్ స్టేషన్) అత్యవసర సేవల నిమిత్తం కొత్తగా 18 పోస్టులను మంజూరు చేస్తూ మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకుంది.

## ధాన్యం కొనుగోళ్లపై రైతుల ధర్నా

**శాంతియుత ధర్నా చేస్తున్నా అరెస్ట్ చేస్తే ఎలా**

**ప్రభుత్వంపై మండిపడ్డ గజ్వేల్ బిఆర్ఎస్ నేత వంటేరు**

మెదక్, : రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. పోలీసులు దౌర్జన్యంగా రైతులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గన్నీ బస్తాలు, లారీలు లేకపోవడంతో వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దౌర్జన్యంగా ధర్నా చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# భారత్-అమెరికా బంధం మరింత బలోపేతం

**మొదటిపేజీ తరువాయి..** కీలక చర్చలు జరిగాయి. భారతదేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు అమెరికా నుంచి ముడి చమురు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రూబియో స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రపంచ ఇంధన రంగాన్ని తన గుప్పిట్లోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను అమెరికా ఎంతమాత్రం అంగీకరించబోదని ఆయన తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య ఉన్న దృఢమైన స్నేహాన్ని గుర్తుచేస్తూ, వారిద్దరి ఆలోచనలు కేవలం తాత్కాలిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా సుదూర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సాగుతాయని అభిప్రాయపడ్డారు. దేశంలో ఉన్న తీవ్రమైన ఎండలను ప్రస్తావిస్తూ.. వాతావరణం చాలా వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగిస్తున్నానంటూ రూబియో కాసేపు సరదాగా వ్యాఖ్యానించారు.

అమెరికా విదేశాంగ మంత్రితో జరిగిన భేటీపై ప్రధాని నరేంద్ర మోదీ సానుకూలంగా స్పందించారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు ప్రాంతీయ, ప్రపంచ శాంతిభద్రతలపై తాము చర్చించినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. రాబోయే రోజుల్లో భారత్-అమెరికా బంధం మరింత పటిష్టం కాగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పనిచేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్‌తో నెలకొన్న ప్రస్తుత ఉద్రిక్తతలను అంతం చేయడానికి సైనిక చర్యల కంటే శాంతియుత చర్చల ద్వారానే పరిష్కారం కనుగొనాలని ఈ సందర్భంగా అమెరికాకు ప్రధాని మోదీ హితవు పలికారు.

## మరోమారు పెరిగిన ఇంధన ధరలు

**మొదటిపేజీ తరువాయి..** నాలుగు రోజుల విరామంతో ఈ ధరలను పెంచుకుంటూ పోతున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో పాటు చమురు కంపెనీలు ధరల ప్రకటన చేసే సమయంలో కూడా మార్పులు చేయడం సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికరంగా మారింది. గతంలో ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని రాత్రి వేళల్లోనే ప్రకటించేవారు, దాంతో మరుసటి రోజు ఉదయం వచ్చే దినపత్రికల ద్వారా ప్రజలకు ఆ విషయం తెలిసేది. కానీ ఇప్పుడు ఆ పద్ధతి మారింది. అర్ధరాత్రి దాటిన తర్వాత లేదా తెల్లవారుజామున ఈ ధరల పెంపును ఖరారు చేస్తున్నారు. ఫలితంగా ఉదయం ఆరు గంటల నుంచే సవరించిన ధరలు అమలులోకి వస్తుండటంతో, ప్రజలు నిద్ర లేచేసరికే పెరిగిన రేట్ల సమాచారం తెలుస్తోంది. వాహనదారులు ఉదయాన్నే టెలివిజన్ వార్తలు లేదా సోషల్ మీడియా వేదికలను చూసినప్పుడే ఈ ధరల వాత గురించి తెలుసుకోగలుగుతున్నారు.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అకాల మరణం చెందడంతో వారి స్వస్థలంలో మరియు బంధువుల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. బాధితుల మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతివేగం మరియు డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా రహదారి ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణికులు మరియు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, పరిమితికి మించిన వేగం ప్రాణాలకే ముప్పని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. కృష్ణా జిల్లా కానుమోలులో అత్యధికంగా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన దాదాపు 95 మండలాల్లో పాదరసం 42 డిగ్రీల పైనే నమోదవుతోంది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం ఎండలు మరింత తీవ్రమై 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. తీవ్రమైన వేడి వాతావరణం దృష్ట్యా ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం పూట బయటకు రాకూడదని అధికారులు సూచిస్తున్నారు.

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

**ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు**

**హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్**

**హైదరాబాద్,** : బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు.

కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ÷ర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

## బక్రీద్ సెలవు 28కి మార్పు

**ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

**హైదరాబాద్, మే24 :** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్-అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28 గురువారం నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్-హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు.

తెలంగాణ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. మే 28న సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

## జింఖానా కల్బ్ స్వాధీనానికి నోటీసులు

**రక్షణ శాఖ కు అప్పగించాలని ఆదేశం**

**న్యూఢిల్లీ, మే24 :**
దేశంలోనే అతి పురాతన క్లబ్‌లలో ఒకటైన లూటియన్స్ ఢిల్లీలోని జింఖానా క్లబ్‌ను ప్రాంగణాన్ని జూన్ 5 లోగా సర్కార్ కు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. రక్షణ మౌలిక సదుపాయాలు బలోపేతం చేసేందుకు, ప్రజా భద్రతాప్రయోజనాల కోసం ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్న 27.3 ఎకరాల స్థలాన్ని రక్షణ శాఖకు అప్పగించాలని ఆదేశించింది.

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రోడ్‌లో ఉన్న ప్రాంగణాన్ని గతంలో సామాజిక ,క్రీడా క్లబ్‌ను నిర్వహించే నిర్దిష్ట ప్రయోజనం కోసం ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చినట్లు మే 22న జారీ చేసిన అధికారిక ఉత్తర్వులో పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం.. జూన్ 5న ఆ ప్రాంగణాన్ని భూమి ,కార్యాలయ భవనాన్ని స్వాధీనం చేసుకోనుంది. ప్రభుత్వం తరపున ఆ శాఖ సాంకేతిక విభాగం స్వాధీనం చేసుకుంటుందని తెలిపింది. 1913లో ఢిల్లీ జింఖానా క్లబ్ ప్రారంభమైంది. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాసానికి ఆనుకొని, లూటియన్స్ ఢిల్లీ నడిబొడ్డున ఉంది. అప్పట్లో దీనిని ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ అని పిలిచేవారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంపీరియల్ అనే పదాన్ని తొలగించారు.

## ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూళ్లు

**టెక్నోరీచ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్‌పై కేసు**

**హైదరాబాద్, మే24 :** టెక్నోరీచ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్ గౌడ్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఉద్యోగాల పేరుతో అభ్యర్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్టు లక్ష్మీకాంత్‌పై ఆరోపణలు వచ్చాయి. ట్రైనింగ్ పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మార్చిలో 80 నుంచి 90 మంది ఉద్యోగులను సంస్థ నియమించు కుంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా లక్ష్మీకాంత్ వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆఫీస్ అ÷-దదె చెల్లించకపోవడంతో గత నెల 25న కార్యాలయానికి తాళం పడింది. జీతాల కోసం ప్రశ్నించిన ఉద్యోగిని సీఈఓ దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్లబ్బులు, పబ్బులకు రావాలంటూ మహిళా ఉద్యోగినిపై ఒత్తిడి చేసినట్టు ఫిర్యాదు వచ్చింది. పెండింగ్ జీతాలు ఇవ్వాలంటే ఒక్కొక్కరు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మీకాంత్ గౌడ్‌పై బెదిరింపులు, వేధింపులు, మోసం తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

# వ్యసనాలు, నేర రహిత సమాజమే లక్ష్యం: జడ్జి కాటం స్వరూప

- న్యాయ చైతన్యంతోనే ఆరోగ్యకర, సురక్షిత సమాజ నిర్మాణం
- కొత్త చట్టాలతో అక్రమ రవాణాకు చెక్
- పొగాకు మహమ్మారిని తరిమికొడదాం
- నేరాల నిర్మూలనలో ప్రజలదే ముఖ్యపాత్ర: ఇల్లందు జడ్జి కాటం స్వరూప




ఇల్లందు మే 23 (జన సంఘర్షణ)

చట్టాల పట్ల అవగాహన, సామాజిక బాధ్యత గల పౌర సమాజం ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన, సురక్షితమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గౌరవనీయులు కాటం స్వరూప పిలుపునిచ్చారు. శనివారం ఇల్లందులో నిర్వహించిన 'న్యాయ చైతన్య సదస్సు'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మే 31న రానున్న 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని' పురస్కరించుకుని పొగాకు మహమ్మారి వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని, అలాగే సమాజానికి శాపంగా మారిన 'మానవ అక్రమ రవాణా' (హ్యూమన్ ట్రాఫికింగ్) నివారణకు తీసుకోవాల్సిన చర్యలను చట్టపరమైన దృక్పథంతో ఆమె విశ్లేషించారు. ఒక సీనియర్ న్యాయమూర్తిగా ఆమె అందించిన సందేశం కేవలం ఉపన్యాసంగా కాక, ప్రతి ఒక్కరినీ సామాజిక బాధ్యత వైపు ఆలోచింపజేసేలా సాగింది. పొగాకు వ్యసనంపై జడ్జి కాటం స్వరూప మాట్లాడుతూ.. నికోటిన్ అనే రసాయన బానిసత్వంలో చిక్కుకుని యువత తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 80 లక్షల మంది పొగాకు వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెపోటు వంటి వ్యాధులతో మరణిస్తుండగా.. అందులో 13 లక్షల మంది ఇతరులు కాల్చే పొగ వల్ల (పరోక్ష ధూమపానం) బలైపోవడం అత్యంత విచారకరమన్నారు. పొగాకు పరిశ్రమల వ్యాపార మాయాజాలాన్ని అడ్డుకుంటూ ముఖ్యంగా భావి భారత సంపదైన యువతను ఈ వ్యసనం నుండి రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అదేవిధంగా, సమాజంలో అత్యంత అమానవీయమైన నేరంగా మారిన మానవ అక్రమ రవాణాపై ఆమె సుదీర్ఘంగా చైతన్యపరిచారు. ఐపీసీ చట్టాలతో పాటు కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాల ప్రకారం అక్రమ రవాణాకు పాల్పడే వారికి కఠినమైన జైలు శిక్షలు, భారీ జరిమానాలు ఉంటాయని స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, సరిహద్దు ప్రాంతాలలో గట్టి నిఘా ఉంచడం ద్వారా ఈ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని, మాయమాటలు మరియు నకిలీ ఉద్యోగాల మోసాలపై ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ అక్రమ రవాణాకు మూలకారణాలైన పేదరికం, నిరక్షరాస్యతలను నిర్మూలించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల పాత్రతో పాటు స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జడ్జి గారు పేర్కొన్నారు. బాధితులను రక్షించడంతో పాటు వారికి ఆశ్రయం, కౌన్సెలింగ్, వైద్య-న్యాయ సహాయం అందిస్తూ సమాజంలో గౌరవంగా బతకడానికి ఉపాధి శిక్షణ ఇవ్వడం సానుకూల మార్పునకు నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా భద్రతకు, మానవ హక్కుల రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక పాలసీలను అమలు చేస్తోందని, ఎక్కడైనా అనుమానాస్పద చర్యలు కనిపిస్తే వెంటనే ఉమెన్ హెల్ప్‌లైన్ 1091, చైల్డ్‌లైన్ 1098 నంబర్లకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రశంసనీయమైన న్యాయ చైతన్య సదస్సులో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్యా రవికుమార్ నాయక్, జనరల్ సెక్రెటరీ షేక్ మొహమ్మద్ ఖాసిం, జాయింట్ సెక్రెటరీ చినుముల నవీన్ కుమార్, ట్రెజరర్ సపావట్ బన్సీలాల్ చురుగ్గా పాల్గొన్నారు. వీరితో పాటు సీనియర్ న్యాయవాదులు పాలమూరి బాలకృష్ణ, పెద్దూరి నర్సయ్య, సూర్యపాక సత్యనారాయణ, ఎస్.డి. రబ్బాని, కోర్టు సిబ్బంది మరియు పోలీస్ శాఖాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. న్యాయవ్యవస్థ ప్రజల చెంతకు చేరి ఇలాంటి చైతన్య సదస్సులు నిర్వహించడం సురక్షిత సమాజ స్థాపనకు ఒక దిక్సూచి లాంటిది.

# శ్రామిక శక్తినే ప్రగతి రథం: కూనంనేని సమక్షంలో ఏఐటీయూసీలోకి భారీగా కార్మిక వలసలు

- కార్మిక హక్కుల రక్షణకు ఎర్రజెండానే రక్షాకవచం: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- కూనంనేని సమక్షంలో ఏఐటీయూసీ, సిపిఐలో చేరిన పాల్వంచ మున్సిపల్ కార్మికులు

కొత్తగూడెం మే 23 (జన సంఘర్షణ)

ఐక్య పోరాటాల ద్వారానే శ్రామిక లోకం తన హక్కులను కాపాడుకోగలదని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సాగే ప్రస్థానంలో ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. పాల్వంచ మున్సిపల్ శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 90 మంది కార్మికులు శనివారం కూనంనేని సమక్షంలో ఏఐటీయూసీ, సిపిఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన ఎర్ర కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఒక నిబద్ధత కలిగిన సీనియర్ ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన ప్రసంగం.. కార్మికుల్లో కొత్త చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపే విధంగా సాగింది. సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. భారతదేశంలో కార్మిక వర్గం, ఉద్యోగులు నేడు అనుభవిస్తున్న అనేక హక్కులు, చట్టబద్ధమైన సౌకర్యాలు కేవలం పాలకుల దయాదాక్షిణ్యాలు కావని, అవి ఏఐటీయూసీ శతాబ్ద కాలంగా చేసిన రక్తం కూడిన పోరాటాల ఫలితమేనని గుర్తుచేశారు. శ్రామికుడికి కనీస వేతనం అందించడం, వారి ఉద్యోగాలకు పనిభద్రత కల్పించడం సమాజ సంక్షేమానికి తొలి అడుగు అని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను, వేతనాలను సకాలంలో అమలు చేయడం యాజమాన్యాలు, పాలకుల కనీస బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. కేంద్రంలోని పాలకుల విధానాలపై ఆయన సానుకూల విమర్శ చేస్తూ, ఎన్నో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడం శ్రామిక సంక్షేమానికి విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. చట్టాల సంరక్షణ కోసం, హక్కుల సాధన కోసం కార్మిక వర్గం శాంతియుత మార్గంలో తిరగబడితే, పాలకులు తమ మొండి వైఖరిని వీడక తప్పదని ఒక సీనియర్ నాయకుడిలా దిశా నిర్దేశం చేశారు. పాల్వంచ మున్సిపల్ కార్మికులు తీసుకున్న ఈ ఐక్యతా నిర్ణయాన్ని కూనంనేని సాంబశివరావు మనస్ఫూర్తిగా అభినందించారు. అధికార గర్వంతో ఎవరైనా శ్రామికుల హక్కులను కాలరాయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరిస్తూనే, కార్మికుల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం అండగా ఉంటానని, చట్టబద్ధమైన సౌకర్యాల అమలుకు శాసనసభ లోపలా, వెలుపలా తన సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ భారీ చేరికల కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు వేముల కొండలరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరై కార్మిక వర్గానికి ఘనస్వాగతం పలికారు. సిపిఐ పార్టీలో చేరిన వారిలో ఏలూరు రామారావు, విజయలక్ష్మి, దొనకొండ రామకృష్ణ ఉండగా, ఏఐటీయూసీలో నాగేశ్వరావు, రవి, సురేందర్, లక్ష్మయ్య, గిగ్ వర్కర్లు శ్రీను, రాజేష్, నితిన్ సహా పలువురు శ్రామికులు చేరారు. కార్మిక శక్తే దేశ ప్రగతికి అసలైన మూలస్తంభం అని, ఆ స్తంభానికి రక్షణ కల్పించినప్పుడే సుస్థిర సమాజం సాధ్యమవుతుందనే ఆలోచనను ఈ న్యాయపోరాట సదస్సు రేకెత్తించింది




# నకిలీ విలేఖరి అరాచకాలకు బ్రేక్

- బాధితురాలికి అండగా నిలిచిన ఖమ్మం సీపీ
- స్పందించిన ఖమ్మం సీపీ సునీల్ దత్, తక్షణ విచారణకు ఆదేశం
- కన్నీరు తుడిచిన చట్టం: కారేపల్లి బాధిత మహిళకు సీపీ అభయహస్తం




కారేపల్లి మే 23 (జన సంఘర్షణ)

న్యాయం కోసం తపించే సామాన్యుడికి, ముఖ్యంగా ఆపదలో ఉన్న మహిళలకు రక్షక భట నిలయాలు ఎల్లప్పుడూ భరోసాగా నిలుస్తాయని ఖమ్మం పోలీస్ కమీషనర్ (సీపీ) సునీల్ దత్ మరోసారి నిరూపించారు. కారేపల్లి మండలంలో ఒక గిరిజన మహిళపై స్థానిక నకిలీ విలేఖరి పచ్చిపాల వెంకట్, అతని అనుచరుడు బన్సీలాల్ మద్యం మత్తులో జరిపిన అనాగరిక వేధింపుల ఘటనపై బాధిత మహిళ ప్రజావాణి వేదికగా కన్నీటి పర్యంతమైంది; అయితే, అప్పటికే ఒక ముఖ్యమైన అధికారిక సమావేశంలో ఉన్నప్పటికీ, బాధితురాలి ఆవేదనను గమనించి సీపీ తక్షణమే స్పందించడం వారి నిబద్ధతకు నిదర్శనం. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించిన నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే రిమాండ్‌కు తరలించాలని స్థానిక ఏసీపీని ఆయన ఆదేశించడం గమనార్హం. ఒక నిబద్ధత గల ఉన్నతాధికారి శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలా సకాలంలో నిర్ణయం తీసుకున్నప్పుడు.. అది కేవలం ఒక సమస్య పరిష్కారంతో ఆగిపోదు, సమాజంలో మహిళల రక్షణపై నమ్మకాన్ని పెంచడంతో పాటు అరాచక శక్తుల గుండెల్లో భయాన్ని రేకెత్తిస్తుంది; ఎందుకంటే బాధితుడి కన్నీటి చుక్కను తుడిచే చట్టం ఉన్నప్పుడే కదా నాగరిక సమాజానికి నిజమైన గౌరవం లభించేది.

# ఇల్లందులో ఇందిరమ్మ వెలుగులు

- గూడు లేని పేదవాడి సొంతింటి కల నిజం చేస్తున్న ప్రజాప్రతినిధులు



ఇల్లందు మే 23 (జన సంఘర్షణ)

నిజమైన ప్రజాస్వామ్యానికి సార్థకత చేకూరేది ప్రభుత్వ సంక్షేమం క్షేత్రస్థాయిలో ఉన్న చివరి లబ్ధిదారుడికి చేరినప్పుడే. ప్రస్తుతం ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో సాగుతున్న 'ఇందిరమ్మ గృహాల పరిశీలన' కార్యక్రమం సరిగ్గా ఇదే సూత్రాన్ని రుజువు చేస్తోంది. సొంతింటి కల అనేది కేవలం ఒక ఆశగా మిగిలిపోకుండా, ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య నిరంతర పర్యవేక్షణ, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశంలో ఈ ప్రక్రియ కేవలం ఒక అధికారిక తనిఖీలా కాకుండా, ప్రజల కష్టాలను తీర్చే ఒక సేవా యజ్ఞంలా సాగుతుండటం గమనార్హం. మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ స్వయంగా వార్డుల్లో పర్యటిస్తూ, డబ్బులు లేక లేదా ఇతర కారణాల వల్ల ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, వాటిని త్వరగా పూర్తి చేయించేందుకు తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. 13 మరియు 23వ వార్డుల్లో స్థానిక నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంతో బాధ్యతగా లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బోళ్ల సూర్యం, వైస్ చైర్మన్ పెండ్యాల రాజు వంటి పలువురు ప్రజాప్రతినిధులు ఈ పర్యటనల్లో పాల్గొని పేదలకు అండగా నిలబడ్డారు. ఇలాంటి పారదర్శకమైన పర్యవేక్షణే భవిష్యత్తులో ప్రతి పేద కుటుంబానికి ఒక గూడు దొరికేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# టేకులపల్లి ప్రగతి బాట: రూ. 1.33 కోట్ల పనులకు ఎమ్మెల్యే కనకయ్య శ్రీకారం

- ప్రజా సంక్షేమమే పరమావధిగా ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటన



టేకులపల్లి మే 23 (జన సంఘర్షణ)

ప్రజా ప్రగతికి సజీవ సాక్ష్యాలుగా మారుతున్న గ్రామాలు; ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, కోటిన్నర నిధులతో మౌలిక వసతుల కల్పన, తాగునీటి ప్లాంట్ ప్రారంభోత్సవాలతో పల్లెల్లో వెల్లివిరుస్తున్న నూతనోత్సాహం. మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్న పాలన పల్లెల్లో సరికొత్త వెలుగులు నింపుతోంది అనడానికి టేకులపల్లి మండలంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య జరిపిన విస్తృత పర్యటనే ఒక సజీవ నిదర్శనం. ఒకవైపు పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తూ కిష్టారం, లచ్చగూడెం గ్రామాల్లో ప్రజా ప్రభుత్వం అందించిన 'ఇందిరమ్మ ఇళ్ల' లబ్ధిదారుల గృహప్రవేశాల్లో స్వయంగా పాల్గొని వారి ముఖాల్లో ఆనందాన్ని పంచుకోవడం, మరోవైపు తడికలపూడి పంచాయతీ లక్ష్మీపురంలో ఏకంగా రూ.1.13 కోట్ల భారీ వ్యయంతో కల్వర్ట్ స్లాబ్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం (రవాణా సౌకర్యాల) బలోపేతానికి అద్దం పడుతోంది. లచ్చగూడెంలో సరికొత్త పంచాయతీ కార్యాలయ భవనాన్ని, అలాగే బొమ్మనపల్లిలో ప్రజల ప్రాథమిక అవసరమైన స్వచ్ఛమైన తాగునీరు అందించే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం చూస్తుంటే-అధికారం అనేది కేవలం పాలన కోసమే కాదు, పల్లె ముఖచిత్రాన్ని మార్చే ఒక అద్భుత సాధనమని ఈ పర్యటన నిరూపించింది. ఈ ప్రగతి ప్రస్థానంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు లక్కినేని శ్యామ్ మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కాలే ప్రసాద్ వంటి స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు భాగస్వాములు కావడం పల్లెల స్వయంసమృద్ధికి ఒక ఆరోగ్యకరమైన సంకేతం; ఎందుకంటే పునాది బలంగా ఉంటేనే కదా, ప్రగతి సుస్థిరంగా నిలిచేది.

# జన హితమే లక్ష్యం: 20వ వార్డులో కౌన్సిలర్ జాఫర్ ఆధ్వర్యంలో ప్రగతి అడుగులు

- పారిశుధ్య ప్రక్షాళనకు 'స్పెషల్ డ్రైవ్'.. పెన్షనర్ల ముంగిటకే ఆధార్ సేవలు
- మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ సమక్షంలో వార్డు అభివృద్ధిపై చెరగని ముద్ర వేస్తున్న స్థానిక నాయకత్వం.




ఇల్లందు మే 23 (జన సంఘర్షణ)

పదవి అనేది కేవలం అధికారం కాదు, ప్రజల నమ్మకానికి నిలువెత్తు బాధ్యత అని నిరూపిస్తున్నారు ఇల్లందు మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. జాఫర్. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా ఆయన తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో వార్డు ముఖచిత్రం మారుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ముఖ్య అతిథ్యంతో, కౌన్సిలర్ జాఫర్ అహర్నిశలూ శ్రమిస్తూ అటు పారిశుధ్య లోపాలను వేళ్లూతనూ కదిలించేలా వార్డులో చేపట్టిన 'బాక్స్ డ్రైన్ క్లీనింగ్ స్పెషల్ డ్రైవ్' వినూత్న ప్రజాసేవకు అద్దం పడుతోంది. కేవలం మురికి కాలువల ప్రక్షాళనతోనే సరిపెట్టకుండా, సమాజంలో అత్యంత ఆదరణ లభించాల్సిన వృద్ధులు, వికలాంగులైన పెన్షనర్ల కోసం యూపీఎస్ స్కూల్‌లో ప్రత్యేకంగా 'పెన్షన్ ఆధార్ అథెంటికేషన్ అప్డేట్ కేంద్రాన్ని' ఏర్పాటు చేయించి, లబ్ధిదారులకు సేవలను మరింత చేరువ చేయడం జాఫర్ సమర్థవంతమైన కార్యాచరణకు నిదర్శనం. ఈ సంక్షేమ, ప్రగతి యజ్ఞంలో పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు దొడ్డ డానియల్, బానోత్ రవి నాయక్, గాలిపల్లి సురప్ప, ఆర్‌పి సునీత వంటి సీనియర్ నాయకులు సైతం భాగస్వామ్యం కావడం విశేషం; ఎందుకంటే, ఒక నిబద్ధత గల ప్రజాప్రతినిధి వార్డును ప్రగతి పథంలో నడిపించాలనుకున్నప్పుడు, అది కేవలం ఒక వార్డు సమస్యల పరిష్కారంగానే మిగలదు.. మున్సిపాలిటీ మొత్తానికే ఒక ఆదర్శవంతమైన దిక్సూచిగా మారుతుంది.

## పోక్స్ కేసులో నిందితుడు పై 20 సంవత్సరాలు జైలు శిక్ష



మహబూబ్నగర్/మే 23/(జన సంఘర్షణ)
మహబూబ్నగర్ జిల్లా బాలసదన్, మెట్టుగడ్డ ప్రాంతంలో మైనర్ బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడుపోక్స్ కేసులో నిందితుడు పై 20 సంవత్సరాలు జైలు శిక్ష కఠిన కారాగారా శిక్ష బిరూ.50, వేల జరిమానా విధించిన హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## బాన్సువాడ ఎల్లయ్య చెరువులో అక్రమ మట్టి త్రవ్వకాలు

◆ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు



బాన్స్వాడ ప్రతినిధి /మే 23/(జన సంఘర్షణ)
బాన్సువాడ ప్రతిపక్ష కౌన్సిలర్లు ఎల్లయ్య చెరువు తవ్వకాల గురించి మొదటి రోజున బాన్సువాడ ఆర్.డి.ఓ అక్రమ తవ్వకాలను ఆపాలని వినతి పత్రము ఇవ్వడం జరిగింది. అదే విధంగా ఇరిగేషన్ వారికి కూడా తెలుపడం జరిగింది. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు మాకు ఎలాంటి సంబంధం లేదని చేతులు ఎత్తివేసానని కౌన్సిలర్లు ఆరోపించారు. చెప్పడం జరిగింది. కౌన్సిలర్లము కలిసి ఆర్.డి.ఓ వద్దకు వెళ్లి సుమారు (100) ట్రాక్టర్లు (30) నుండి (40) టిప్పర్లు (6) జేసిబిలతో తవ్వకాలను జరుపుతున్నారని. భవిష్యత్తులో మత్తకారులు చేపలు పట్టేటప్పుడు వారు చనిపోయే ప్రమాదం ఉన్నదని , ఆ మట్టి అనేది రైతులకు కాకుండా వెంచర్లకు , ఇటుక బట్టీలకు ప్లాట్లవారికి ఒక్క టివరుకు రూ2500/- లు ఒక్క ట్రాక్టర్ రూ.800/- చొప్పున విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.(7) కౌన్సిలర్లు ఆర్.డి.ఓ కి ప్రత్యేకంగా మున్సిపాలిటికి లాభం వచ్చేలా కొంత మంది కాంట్రాక్టర్లను పిలిచి టెండరు వేసి రైతుల పొలాలకు మాత్రమే వెల్లేలా ఒక ధర నిర్ణయించాలని కౌన్సిలర్లు కోరుతున్నారు. కోరడం జరిగింది. 3వ రోజున ఆర్.డిఓ.ని సంప్రదిస్తే నేను విజిట్కు వస్తానని ఇప్పుడైతే ఆర్.ఐని అక్కడికి వంపిస్తానని చెరువులో టిప్పర్లు నడవకుండా ట్రాక్టర్లు మాత్రమే నడిచేటట్లు చూస్తానని చెప్పడం జరిగింది. ఆర్.ఐ వచ్చి చెప్పినప్పటికి ఉదయం సుమారు 7 గంటల నుండి రాత్రి 7:00 గంటల వరకు టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసిబిలు నడవాలని ఆర్. ఐవచ్చి వారికి చెప్పడం జరిగింది. అయినప్పటికి వారు ఉదయం 7 నుండి రాత్రి 2 గంటల వరకు టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసిబిలు అక్రమంగా విచ్చలవిడిగా నడిపి మట్టిని అమ్ముకున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. ఎల్లయ్య చెరువు పూడిక తీసివేత కార్యక్రమాన్ని టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు కు అప్పగిస్తే మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని కౌన్సిలర్లు వెల్లడించారు.. ఆర్.డి.ఓ. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వాళ్లకు ఎన్నిసార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తమరు అయినా దీనిపై తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బాన్సువాడ మున్సిపల్ కౌన్సిలర్లు వినతి పత్రం అందజేశారు.

## ఇసుక కుప్పలో పసికందు మృతదేహం



కామారెడ్డి బాన్సువాడ ప్రతినిధి/మే 23/(జన సంఘర్షణ)
మొన్న బాన్స్వాడ, నిర్మల్ బస్టాండ్లో మూత్రశాలలో. శనివారం కామారెడ్డిలో నవజాతు శిశువులు వదిలిపెట్టి వెళ్తున్నారు ఆ కసాయి తల్లి. పెంచే పోషణ లేక ఇటీవల బాన్స్వాడలో, హైదరాబాద్లో పిల్లలు అమ్మకానికి పెట్టిన సగటునులు వెలుగు చూసాం. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఒక ఇసుక కుప్ప పై మృతిచెందిన రెండు రోజుల ఆడపిల్ల మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కామారెడ్డి పట్టణంలోని ముషీరాభాగ్ ప్రాంతంలో ఇసుక కుప్పలో రెండు రోజుల వయసున్న పసికందు మృతదేహాన్ని స్థానికులు శనివారం ఉదయం గుర్తించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, ఆ రెండు రోజుల పసికందు ఎవరు? ఎక్కడి నుంచి ఈ పసికందును తీసుకువచ్చినట్లు విచారణ జరపగా కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పెద్ద కోడాపుగల్ గ్రామానికి చెందిన గంగమని అనే మహిళ రెండు రోజుల క్రితం బాన్స్వాడ ఆసుపత్రిలో ఓ చిన్నారికి జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డ చనిపోవడంతో ఎవరికి తెలియకుండా చాటుగా తీసుకువచ్చి కామారెడ్డి పట్టణంలోని ముషీరాబాద్ ప్రాంతంలో పడేసి కాల్చడానికి దహనం చేయడానికి ప్రయత్నించి నట్లు సీఐ నరహరి వెల్లడించారు.మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పట్టణ సీఐ నరహరి ఈ విషయంపై మీడియాతో మాట్లాడారు.

## ఏటీఎంలో చోరీకీ ప్రయత్నం

నిజాంబాద్ నగరం/మే 23(జన సంఘర్షణ)




నిజాంబాద్ నగరంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ఏటీఎంలోకి చోరీకి జరిగిన ప్రయత్నం త్రీవ కలకలం రేపింది, అయితే సాంకేతిక పరిజ్ఞానం సకాలంలో సంప్రదించడం, పోలీసులు మెరుపు వేగం తో రంగంలోకీ దించడంతో తృటిలో తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి, నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధి లోని పోచమ్మ గల్లీలో ఉన్న ఎస్బిఐ ఏటీఎంలోకి అర్ధరాత్రి సమయంలో ఇద్దరు దొంగలు చోరా బడ్డారు. మొదట వారు తమ వద్ద ఉన్న డెబిట్ కార్డ్ను మిషన్ లో ఉంచి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించారు. అయితే సాంకేతిక కారణాలవల్ల నగదు లేకపోవడంతో దొంగలు అసలు సర్వ రూపం బయటపడింది ఏదైనా డబ్బులు కొట్టేయాలంటే దురాశలతో ఏటీఎం యంత్రాన్ని గట్టిగా పట్టుకొని ఊపడం ప్రారంభించారు. దుండగులు ఏటీఎం మిషన్ ను బలంగా కదిలించడంతో తక్షణమే అందులోని సెక్యూరిటీ సైరన్ ఉ అలారం) పెద్ద శబ్దంతో మోగింది, దీంతో సర్వర్క స్థానిక పోలీసుల సైతం ఆటోమెటికగా అలర్ట్ గా మెసేజ్ వెళ్ళింది. అలారం మోగిన వెంటనే ఒకటవ టౌన్ పోలీసులు క్షణాల ఒకే క్షణంలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఏటీఎం నుంచి పారిపోయేందుకు, ప్రయత్నిస్తున్న ఇద్దరినీ నిందితులను అక్కడకక్కడే చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను విచారిస్తున్నట్టు ఒకటవ టౌన్ పోలీసులు తెలిపారు.

## ఇంటర్నేషనల్ సెక్స్ రాకెట్ గుట్టురట్టు.. వెలుగులోకి సంచలన విషయాలు

కేరళ /మే 23/(జన సంఘర్షణ)
కేరళలోని కొచ్చి కేంద్రంగా నడుస్తున్న భారీ అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా, సెక్స్ రాకెట్ ముఠాను అక్కడి సిటీ పోలీసులు ఛేదించారు. మోడలింగ్ రంగం ముసుగులో విదేశాల్లో గ్లామరస్ అవకాశాలు, బ్యూటీ పార్లర్లలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మిస్తూ కేరళకు చెందిన అమాయక యువతులను ఈ ముఠా వలలో వేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఠా మాటలు నమ్మి గల్ఫ్ దేశాలకు వెళ్లిన యువతులను అక్కడ నిర్బంధించి, బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టినట్లు విచారణలో బయటపడింది. విదేశాలకు తీసుకెళ్లిన తర్వాత బాధితులకు ఆహారంలో మత్తుమందు కలిపి ఇచ్చి, స్పృహ కోల్పోయిన సమయంలో లైంగిక దాడులకు పాల్పడి వాటిని వీడియోలుగా చిత్రీకరించేవారని పోలీసులు తెలిపారు. అనంతరం బాధితుల పాస్పోర్టులను స్వాధీనం చేసుకుని, ఆ వీడియోలను చూపిస్తూ బ్లాక్మెయిల్ చేసి తమ ఆధీనంలో ఉంచుకున్నట్లు వెల్లడైంది. ఈఅంతర్జాతీయ ముఠా బారిన పడిన ఇద్దరు యువతులు అక్కడి నుంచి తప్పించుకుని కొచ్చి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో ఈ దారుణ వ్యవహారం వెలుగులోకి




వచ్చింది. కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కొచ్చి పోలీస్ కమిషనర్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న ఈ రాకెట్ ప్రధాన సూత్రధారి స్టోయ్ సీ సింధు అనే మహిళను ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో లుకౌట్ నోటీసుల ఆధారంగా పోలీసులు అరెస్టు చేశారు. ఆమెతో పాటు ఈ ముఠాకు సహకరించిన మరో ముగ్గురు నిందితులను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మంగ్లూర్లో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం..

◆ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుంది
◆ డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్...



నిజాంసాగర్:/23/(జన సంఘర్షణ)
కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్ గ్రామంలో జొన్న రైతులకు ఊరటనిచ్చే విధంగా జొన్న కొనుగోలు కేంద్రాన్ని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ప్రారంభించారు. రైతులు పండించిన జొన్నలకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు మద్దతుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రజా పండరి, బిచ్కుంద మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగ్ నాథ్ పటేల్, మంగ్లూర్ గ్రామ అధ్యక్షులు, సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాలురలకు గుట్కా, మత్తు పదార్థాలు అమ్మితే భారీ జరిమానా

◆ వ్యాపారస్తులతో గ్రామస్తుల సమావేశం



నిజామాబాద్/మే23/(జనసంఘర్షణ)
మద్యం మత్తు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. యువతతో పాటు 15 ఏళ్ల బాలురు సైతం మద్యానికి బానిసై తమ నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎడపల్లి గ్రామ పరిధిలో 18 సంవత్సరాల లోపు పిల్లలకు సిగిరెట్,గుట్కా , మత్తు పదార్థాలు అమ్మరాదని,మద్యం దుకాణం, కిరాణా దుకాణం ,సూపర్ మార్కెట్, పాన్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించి వారికి చెప్పడం జరిగింది, గ్రామంలో అన్ని దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసి వేయాలని ఆదేశించడం జరిగింది, గ్రామంలో గంజాయి తాగడాన్ని అమ్మడాన్ని పూర్తిగా నిషేధించామని, ఎవరైనా అమ్మిన, కొన్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్ పోల మాల్కారెడ్డి, స్థానిక ఏ ఎస్ ఐ చందర్,గ్రామ పంచాయతీ వర్గం సభ్యులు, గ్రామ పెద్దలు కామప్ప, మల్కన్న, జహీర్, బాబా, మల్లెపూల శ్రీనివాస్, ప్యాట ↄ సంతోష్,ద్యాకం సాయిరెడ్డి దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ ఎల్లయ్య చెరువుపై మట్టి మాఫియా

◆ వెంచర్లకు, ఇటుక బట్టీలకు తరలింపు

బాన్సువాడ ప్రతినిధి /మే 23/(జన సంఘర్షణ)
ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతున్న మట్టి మాఫియా, ఇసుక అక్రమ ఇసుకను కట్టడీ చేయడం, అలాగే మొరంకు కట్టడి, ఇసుక మొరం వదిలేసి మట్టిపై అక్రమంగా తరలించడం అధికారులు నిలపెట్టాలని ముఖ్యంగా పోలీస్ సిబ్బంది వీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సాగునీటి వనరులపై కొంతమంది మట్టి మాఫియా చెలరేగిపోతుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, కుంటాలపై మట్టి మాఫియా పడి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్ట రాజ్యాంగ మట్టి త్రవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని అడ్డుకట్ట వేయవలసిన రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ కాసులకు కక్కుర్తి పడుతున్నారు. ఫలితం చెరువులన్నీ ఇష్ట రాజ్యాంగ త్రవ్వకాలు సాగుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువులు సుందరీ కరణ చేయాలంటూ, ఎల్లయ్య చెరువు కబ్జాకు గురవుతుందంటూ బాన్సువాడకు చెందిన భాజపా నాయకులు గత ఏడాది నవంబర్ 14న ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మంత్రి తక్షణం స్పందించి ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరావు ఎల్లయ్య చెరువు ను పరిశీలించారు. ఎల్లయ్య చెరువు కబ్జాకు గురవుతుందని అధికారుల విచారణలో వెలుగు చేసింది.49.44 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు 20 ఎకరాలపైగా కబ్జాకు గురైంది. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశం మేరకు మూడు కోట్ల నలభై లక్ష రూపాయలు ఈ ఎల్లయ్య చెరువు సుందరీ కర్ణ కోసం కేటాయించారు.

ఎల్లయ్య చెరువు లో ఉన్న మట్టిని తొలగించడానికి టెండర్లు పెట్టి కాంట్రాక్టర్కు అప్పగిస్తే ఇటు రైతులకు ఉచితంగా మట్టి పొలాల్లోకి వెళ్లడమే కాకుండా, మున్సిపల్ శాఖకు పెద్ద ఎత్తున ఆదాయం రానున్నప్పటికీ ఆ వైపు దృష్టి పెట్టకుండా కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు చెరువు వద్ద బైఠాయించి మరి అక్రమ మట్టి త్రవ్వకాలు జరుపుతున్నారు. వాస్తానికి చెరువులో మట్టి త్రవ్వకాలు జరిపితే రైతు పొలాల్లోకి ఉచితంగా మట్టిని అందజేయవలసి ఉండగా, రైతు పొలాలను పక్కనపెట్టి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎల్లయ్య చెరువులో మట్టి త్రవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పొలాల్లో మట్టి వేయకుండా వెంచర్లకు, ఇటుక బట్టీలకు అమ్ముకుంటున్నారు కొంతమంది పెద్దలు. ఏకంగా అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు చెరువు వద్దనే బైఠాయించి మట్టి తవ్వకాలకు ఎవరు అడ్డం వస్తారో చూద్దామంటూ హెచ్చరిస్తూ ఎల్లయ్య చెరువులో మట్టి జోరుగా అక్రమ రవాణా జరుగుతుంది. ఈ విషయంలో స్థానిక ఆర్డిఓ గాని, స్థానిక ఎమ్మెల్యే గాని పట్టించుకోకపోవడం పట్ల చెరువులో





మట్టి మాఫియా చెలరేగిపోతుంది.

## మానవత్వాన్ని చాటుకున్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా



బిక్నూర్/మే 23/(జన సంఘర్షణ)
బిక్నూర్ మండలం జంగంపల్లి 44వ రహదారి రంగంపేట గ్రామానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అది చూసి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుపియా హైదరాబాద్ నుండి వస్తుండగా జంగంపల్లి శివారులో రోడ్డు ప్రమాదం ఘటన జరిగిన సమయంలో అది చూసి ప్రభుత్వ వైద్యులతో మాట్లాడి కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
ఆదివారం 24 మే 2026

# కాంగ్రెస్‌లో రాజుకున్న 'సీనియర్ల' అసంతృప్తి

- **ఎమ్మెల్యే 'కోటరి' రాజకీయంపై క్యాడర్ ఆగ్రహం: గార్ల మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు పట్ల వివక్ష తగదు**
- **భజన పరులకే పదవులు.. కష్టపడ్డ వారికి కన్నీళ్లా? హస్తం పార్టీలో అంతర్గత కలకలం**
- **పార్టీ కోసం మూడు దశాబ్దాల శ్రమ: నికార్సైన కాంగ్రెస్ నేత రామారావుకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని డిమాండ్**

**ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం**

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లందు నియోజకవర్గ గార్ల, కామేపల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా, గార్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘ సేవలు అందిస్తున్న ధనియాకుల రామారావు ఉదంతం ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. తన 52 ఏళ్ల జీవిత కాలంలో దాదాపు 32 సంవత్సరాలకు పైగా కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సైతం ప్రజాక్షేత్రంలో నిరంతరం పనిచేసిన చరిత్ర ఆయన సొంతం.

**ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పోరాటం**

చిన్నతనం నుంచే కమ్యూనిస్టులకు, నక్సలైట్లకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి కాంగ్రెస్ పార్టీ జెండాను మోసిన చరిత్ర ధనియాకుల రామారావు గారిది. జాతీయ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, అధిష్ఠానం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అగ్రభాగన నిలిచారు. ఒక సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి.. ఇల్లందు బ్లాక్ పరిధిలో 2004, 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సాయశక్తులా కృషి చేశారు.

**కష్టకాలంలోనూ వీడని కాంగ్రెస్ సిద్ధాంతం**

2018 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన కొందరు నేతలు అధికార పార్టీ తీర్థం పుచ్చుకొని ద్రోహం చేసినా ధనియాకుల రామారావు అధైర్యపడలేదు. అప్పటి అధికార పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, చెల్లాచెదురైన కార్యకర్తలకు కొండంత అండగా నిలిచారు. నాయకులు పార్టీలు మారినా.. తాను మాత్రం నమ్మిన సిద్ధాంతాన్ని వీడకుండా గార్ల మండలాన్ని కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని కంచుకోటగా నిలపడంలో రామారావు ఎనలేని కృషి చేశారు.

**వరుస విజయాల్లో 'బ్రాండ్' రామారావు వ్యూహం**

మండలంలో బూత్ స్థాయి నుండి పటిష్టమైన క్యాడర్ నిర్మాణాన్ని చేపడుతూ, ప్రతి కార్యకర్తను కలుపుకొని పోయిన ఫలితంగానే.. గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య విజయానికి, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ రావడానికి ధనియాకుల రామారావు వ్యూహాత్మక కృషి ప్రధాన కారణమైంది. స్థానిక మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ కైవసం చేసుకోవడంలో ఆయన పాత్ర అద్వితీయం.



**తెలంగాణ ఏర్పాటు తర్వాతి ఎన్నికల విజయాలు**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇల్లందు నియోజకవర్గంలో జరిగిన 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు అహర్నిశలు శ్రమించి భారీ విజయాలను అందించారు. ఎంతో కష్టపడి ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించుకుంటే.. గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులు కార్యకర్తలను పట్టించుకోకుండా ముఖం చాటేస్తున్నారని స్థానిక శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



**ఎమ్మెల్యే 'కోటరి' వివక్షపై క్యాడర్ ఆగ్రహం**

ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య విజయానికి మూలాధారంగా నిలిచిన ధనియాకుల రామారావు సుదీర్ఘ అనుభవాన్ని స్థానిక నాయకత్వం పక్కనబెట్టడంపై క్యాడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇల్లందు ఎమ్మెల్యే కోటరి (చుట్టూ ఉండే కొందరు నాయకులు) అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరి పార్టీ ఐక్యతకు తీవ్ర హాని కలిగిస్తోందని, కేవలం అధికార భోగం కోసం చుట్టూ చేరిన భజన పరులకే పదవులు, ప్రాధాన్యతలు దక్కుతున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది.

**ఎమ్మెల్యే పీఏ వ్యవహారశైలిపై డిమాండ్**

పార్టీ కోసం సర్వస్వం ధారపోసిన సీనియర్లు, నమ్మకమైన కార్యకర్తలు నేడు స్థానికంగా ఎంతో బాధాకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే పి ఏ (పర్సనల్ అసిస్టెంట్) వ్యవహార శైలి కూడా పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తోందని, తక్షణమే సదరు పి ఏ ను విధుల నుండి తప్పించాలని ధనియాకుల రామారావు డిమాండ్ చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

**నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి జిల్లాకు అన్యాయం**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ముగ్గురు అత్యంత సమర్థవంతమైన మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, ఇటీవల ప్రకటించిన 11 కీలక నామినేటెడ్ పోస్టుల భర్తీలో జిల్లాకు కనీస ప్రాతినిధ్యం కల్పించలేదు. అదే సమయంలో ప్రకటించిన స్టేట్ కార్పొరేషన్ నామినేటెడ్ పోస్టుల భర్తీలో మహబూబాబాద్ జిల్లాకు లేదా ఇల్లందు నియోజకవర్గానికి కనీసం ఒక్క పదవి కూడా కేటాయించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**మంత్రుల అనుచరులకే పదవుల కట్టబెట్టుడు**

పక్కనే ఉన్న ఖమ్మం జిల్లా నామినేటెడ్ పదవులను పరిశీలిస్తే, అక్కడ మంత్రులు ఉండి కూడా కేవలం వారి సొంత అనుచరులకే ఆ పదవులను కట్టబెట్టుకున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. 20 నుండి 30 సంవత్సరాలుగా ప్రతికూల పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ జెండా వదలకుండా నిలబడిన ధనియాకుల రామారావు వంటి నికార్సైన నాయకులను ఇలాంటి నామినేటెడ్ పదవులతో గౌరవించకపోతే.. ఇక పార్టీలో కష్టపడే వారికి ఇచ్చే గుర్తింపు ఏముంటుందని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

**ఢిల్లీ అధిష్ఠానానికి బహిరంగ వినతిపత్రం**

ఈ నేపథ్యంలోనే గార్ల మండల ప్రజలు, వివిధ కమిటీలు సంయుక్తంగా భారత జాతీయ కాంగ్రెస్ (×చీజ) న్యూఢిల్లీ అధిష్ఠాన వర్గానికి బహిరంగ వినతిపత్రాన్ని పంపారు. ఇప్పటికైనా స్థానిక నాయకత్వం, రాష్ట్ర అధిష్ఠానం పునరాలోచించి, గార్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధనియాకుల రామారావుకి తగిన గుర్తింపు ఇవ్వాలని, లేనిచో రాబోయే రోజుల్లో ఇల్లందు నియోజకవర్గంలో పార్టీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని క్షేత్రస్థాయి క్యాడర్ గట్టిగా హెచ్చరిస్తోంది.

## సరస్వతి అంత్య పుష్కరాలకు 'భద్రాచలం' ప్రత్యేక బస్సు



భద్రాచలం మే 23 (జన సంఘర్షణ)

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం భద్రాచలం ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు డిపో మేనేజర్ పి. జంగయ్య శనివారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. పుష్కరాలకు వెళ్లాలనుకునే స్థానిక భక్తుల రద్దీని, ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**షెడ్యూల్ మరియు ప్రయాణ వివరాలు:**

డిపో వర్గాల సమాచారం ప్రకారం.. ఈ ప్రత్యేక డీలక్స్ బస్సు మే 27వ తేదీ (బుధవారం) రాత్రి 10:00 గంటలకు భద్రాచలం బస్టాండ్ నుండి బయలుదేరుతుంది. గురువారం ఉదయం నాటికి పుష్కర క్షేత్రానికి చేరుకుంటుంది. భక్తులు అక్కడ పవిత్ర పుష్కర స్నానాలు, దైవదర్శనాలు పూర్తి చేసుకున్న అనంతరం, అదే బస్సు తిరుగు ప్రయాణమై గురువారం మధ్యాహ్నం 12:00 గంటల కల్లా తిరిగి భద్రాచలం చేరుకునేలా ఆర్టీసీ అధికారులు సమయాన్ని సర్దుబాటు చేశారు.

**టికెట్ ధరల విశ్లేషణ - ప్రయాణికులపై భారం:**

అయితే, ఈ ప్రత్యేక బస్సుకు నిర్ణయించిన టికెట్ ధరలపై సామాన్య ప్రయాణికుల నుండి కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సర్వీసులో ప్రయాణించే పెద్దలకు రూ. 1000, పిల్లలకు రూ. 600 గా రవాణా ఛార్జీలను ఖరారు చేశారు. ఆధ్యాత్మిక పర్యటనలకు వెళ్లే సామాన్య, మధ్యతరగతి భక్తులను ప్రోత్సహించాల్సింది పోయి.. కేవలం కొన్ని గంటల ప్రయాణానికి ఈ స్థాయిలో నిబంధనల పేరుతో భారీగా ధరలు నిర్ణయించడం ఆర్టీసీ వ్యాపార ధోరణికి అద్దం పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**పరిమిత సమయం.. భక్తులకు ఇబ్బందే:**

మరోవైపు బస్సు తిరుగు ప్రయాణ సమయంపై కూడా భక్తులలో ఆందోళన వ్యక్తమవుతోంది. గురువారం ఉదయం పుష్కర క్షేత్రానికి చేరుకున్న తర్వాత, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే.. అంటే మధ్యాహ్నం 12 గంటలకల్లా తిరిగి భద్రాచలం చేరుకోవాలనే నిబంధన విధించడం గమనార్హం. పుష్కరాల రద్దీలో భక్తులు స్నానాలు ఆచరించి, పూజా కార్యక్రమాలు ముగించుకోవడానికి ఈ సమయం ఏమాత్రం సరిపోదని, అధికారులు కేవలం బస్సు నడిపామనే మమ అనిపించేలా కాకుండా భక్తుల సౌకర్యార్థం తిరుగు ప్రయాణ సమయాన్ని కాస్త పొడిగిస్తే బాగుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ముందస్తు బుకింగ్ మరియు సంప్రదింపులు:**

ఈ లోటుపాట్లు ఉన్నప్పటికీ, నేరుగా పుష్కర క్షేత్రానికి వెళ్లేందుకు వేరే ఇతర రవాణా మార్గాలు లేని భక్తులకు ఈ ప్రత్యేక బస్సు ఒక మంచి ప్రత్యామ్నాయంగా మారనుంది. పుష్కరాలకు వెళ్లాలనుకునే ఆసక్తి గల ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు. సీట్ల రిజర్వేషన్ మరియు ఇతర పూర్తి వివరాల కోసం భక్తులు 9553990399, 9390612253 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని అధికారులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా

- **బోధన్ లో 32 సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్.**




బోధన్/23/(జన సంఘర్షణ)

శనివారం, బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోధన్ పోలీస్ స్టేషన్ లోలిమన ఊరు మన భద్రత మన బాధ్యతలి కార్యక్రమంలో భాగంగా 32 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమని ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క వార్డు కౌన్సిలర్ 5 చొప్పున కెమెరాలు వారి వార్డు భద్రత కోసం పెట్టాలని చెప్పారు. ఇది వారి భాద్యతగా తీసుకోవాలన్నారు. నగల దుకాణాల యజమానులు తప్పనిసరిగా సిసి కెమెరాలు పెట్టుకోవాలన్నారు. బోధన్ టౌన్‌లో 32 కెమెరాలు పెట్టి సహకరించిన కదం ప్రమోద్‌ను సీపీ సన్మానించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలో డ్రగ్స్ నివారణ, సైబర్ క్రైమ్ పట్ల అవగాహన, రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం వాల్ పెయింట్స్ వేస్తూ ప్రజలలో అవగాహన కల్పిస్తున్నటువంటి సమీర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డి.సి.పి ( అడ్మిన్ ) ఎన్. శుభం ప్రకాష్, బోధన్ ఏసిపి శ్రీనివాస్, బోధన్ ఎస్. హెచ్. ఓ వెంకట నారాయణ, రుద్రూర్ సి. ఐ కృష్ణ, రూరల్ ఎస్. ఐ మచ్చేందేర్, మనోజ్ కుమార్ ఎస్.ఐ బోధన్, మహేష్ ఎస్ఐ ట్రాఫిక్, మున్సిపల్ వైస్ చెర్మన్ ఇలియాస్, బంగారం దుకాణల ప్రెసిడెంట్ శ్రీ కధం ప్రమోద్, కౌన్సిలర్స్ ప్రజలు పాల్గొన్నారు.



## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- **మండల న్యాయ సేవా ప్రాధికార సంస్థ చైర్మన్ శివనాయక్**

భద్రాచలం మే 23 (జన సంఘర్షణ)




ప్రస్తుత సమాజంలో యువత పెడదోవ పడుతూ డ్రగ్స్, ఆల్కహాల్ వంటి వ్యసనాలకు బానిసలుగా మారి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని మండల న్యాయ సేవా ప్రాధికార సంస్థ చైర్మన్ శివనాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం భద్రాచలంలోని 'దక్షిత సొసైటీ డి-అడిక్షన్ సెంటర్' (వ్యసన విముక్తి కేంద్రం) లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రగతికి చోదకశక్తిగా నిలవాల్సిన యువశక్తి ఇలాంటి మత్తు పదార్థాల బారినపడి జీవితాలను చీకటిమయం చేసుకోవడం సమాజానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.

**వ్యసన విముక్తికి న్యాయవాది పడిసిరి శ్రీనివాసరావు పిలుపు:**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ న్యాయవాది పడిసిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్షణికానందం కోసం అలవాటయ్యే వ్యసనాలు కుటుంబాలను రోడ్డున పడేస్తాయని హెచ్చరించారు. డ్రగ్స్, ఆల్కహాల్ వంటి అలవాట్ల నుండి బయటపడలేక మానసిక, శారీరక క్షోభ అనుభవిస్తున్న వారు తక్షణమే ఈ పునరావాస కేంద్రానికి వచ్చి చికిత్స పొందాలని ఆయన పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల విక్రయాలు మరియు వినియోగంపై సమాజంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, యువతను ఈ వ్యసనాల బారి నుండి రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

**ఉచిత చికిత్స సౌకర్యాన్ని వినియోగించుకోవాలి:**

భద్రాచలంలోని దక్షిత సొసైటీ డి-అడిక్షన్ సెంటర్ ద్వారా వ్యసనపరులకు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా నిర్వాహకులు వివరించారు. మత్తుకు బానిసలైన వారిని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి ఇక్కడ ఉచితంగా నాణ్యమైన చికిత్స మరియు కౌన్సిలింగ్ అందిస్తారని, బాధితులు ఎటువంటి మొహమాటం లేకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వక్తలు స్పష్టం చేశారు.

## బిఆర్‌ఎస్ కార్యాలయానికి పూదూరి లక్ష్మీనారాయణ గోడ గడియారం బహూకరణ

ఇల్లందు మే 23 (జన సంఘర్షణ)



స్థానిక బిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఒక ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నాయకులు పూదూరి లక్ష్మీనారాయణ కార్యాలయానికి ఒక గోడ గడియారాన్ని బహుమతిగా అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలు ఊపందుకుంటున్న తరుణంలో, కార్యాలయ అవసరాలను గుర్తించి ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. లక్ష్మీనారాయణ స్వయంగా వచ్చి గడియారాన్ని పార్టీ బాధ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న కార్యకర్తలు ఆయన చొరవను అభినందించారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతకు, కార్యాలయ నిర్వహణపై ఆయనకున్న శ్రద్ధకు ఇది నిదర్శనమని స్థానిక నాయకులు పేర్కొన్నారు.అయితే, ఈ చిన్నపాటి కార్యక్రమం వెనుక నియోజకవర్గ రాజకీయ చిత్రపటం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ఎన్నికల సమయంలో మాత్రమే హడావుడి చేసే నాయకులు చాలామంది ఉంటారు. కానీ, ఎలాంటి ఎన్నికల హడావుడి లేని సమయంలో కూడా పార్టీ కార్యాలయానికి వచ్చి, అక్కడి చిన్న చిన్న అవసరాలను సైతం గుర్తించి పూదూరి లక్ష్మీనారాయణ గారు స్పందించడం ఆయనకున్న క్షేత్రస్థాయి పట్టును చూపిస్తోంది. మరోవైపు, ఇలాంటి చిన్న అవసరాల కోసం కూడా నాయకులు వ్యక్తిగతంగా ముందుకు రావాల్సిన పరిస్థితి ఉండటం గమనార్హం. ఒక నియోజకవర్గ స్థాయి ప్రధాన కార్యాలయంలో కనీస వసతులు, సమయాన్ని చూపే గడియారం లాంటి వస్తువుల ఏర్పాటుపై స్థానిక అధికార యంత్రాంగం లేదా ప్రధాన కమిటీలు ముందే దృష్టి సారించాల్సి ఉందనే విమర్శలు కూడా అంతర్గతంగా వినిపిస్తున్నాయి. కార్యాలయ నిర్వహణను మరింత పక్కాగా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందనే సంకేతాన్ని ఈ ఘటన ఇచ్చింది. ఏది ఏమైనప్పటికీ, పూదూరి లక్ష్మీనారాయణ చేసిన ఈ వినూత్న ఆలోచన పార్టీ శ్రేణుల్లో సానుకూల చర్చకు దారితీసింది. కార్యాలయానికి వచ్చే సామాన్య కార్యకర్తలకు, నాయకులకు సమయ పాలన ఎంత ముఖ్యమో గుర్తుచేసేలా ఈ గడియారం నిలవనుంది. నాయకత్వం వహించే వారు కేవలం పెద్ద పెద్ద హామీలు ఇవ్వడమే కాకుండా, ఇలాంటి చిన్నపాటి అవసరాలను తీరుస్తూ నలుగురికీ ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

# బక్రీద్ పండుగ శాంతియుతంగా జరుపుకోవాలి : మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి

**ఉప్పల్ :**






బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపు కోవాలని మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి ఐపీఎస్ పిలుపునిచ్చారు. పండుగ నేపథ్యంలో ముస్లిం ప్రతినిధులు, గోరక్షక్ సభ్యులతో కలిసి నేరేడ్మెట్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని భద్రత, పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల అంశాలపై విస్తృతంగా చర్చించారు. పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యాపించే వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించిన కమిషనర్, చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండా పరస్పర సహకారంతో పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోవులను తరలించే వాహనాలను అడ్డుకోవడం, వ్యక్తులపై దాడులు చేయడం, బలవంతపు తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని గోరక్షక్ సభ్యులకు సూచించారు. ఏవైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రభుత్వం అనుమతించిన ప్రదేశాల్లోనే జంతువధ నిర్వహించాలని, పరిశుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని కమిషనర్ సుమతి పేర్కొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు

**-కేక్ కట్ చేసి,మజ్జిగ పంపిణీ చేసిన కాంగ్రెస్ శ్రేణులు**

**-ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మాడుగులపల్లి:**



రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు మాడుగులపల్లి మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, కేక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నినాదాలు చేశారు ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సాధారణ ప్రజలు, బాటసారుల కోసం కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వీట్లు, చల్లటి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజానేతగా, నిరంతరం నియోజకవర్గ, రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు ఈ వేడుకల్లో మాజీ జడ్పిటిసి పుల్లెంల సైదులు, స్థానిక సర్పంచ్ ఆర్రూరి నరేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుకల వెంకన్న, నాయకులు గడ్డం పురుషోత్తం రెడ్డి, కల్లు శ్రీనివాస్ రెడ్డి, చేపూరి సత్యనారాయణ, ఉగ్గిడి సత్యనారాయణ, మాడుగుల జానకి రాములు,దైద కృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

**ఐకేపీ కేంద్రాల తనిఖీలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**తరుగు పేరుతో ఇబ్బంది పెడితే సహించేది లేదు**

**అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి**

**ప్రజావారధి-మాడుగులపల్లి:**





నియోజకవర్గంలోని రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు మాడుగులపల్లి మండలంలోని పాములపాడు, చిరుమర్తి, ఆగమోత్కూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు,ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన వసతులు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భం గా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లా డుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతేనని, రైతాంగాన్ని ఆదు కోవడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు ఐకేపీ సెంటర్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు గా అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు, రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు ఎవరైనా తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, నిబంధనల ప్రకారం నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కు సూచించారు,ముఖ్యంగా తూకాల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ ఆకస్మిక తనిఖీలో ఆర్డీఓ రమణారెడ్డి, తాసిల్దార్ సరోజ పావని,ఏపీఎం మధుసూదన్, ఐకేపీ సీసీలు, వీఓఏలు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక సర్పంచులు కునుకుంట్ల అంజయ్య, అండెం రేణుక యాదయ్య, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రైతులు పాల్గొన్నారు.

# మల్లికుదుర్ల ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల చిన్న సహాయం

**-విద్యుత్ సమస్య పరిష్కారంతో పాటు ఐదు ఫ్యాన్లు అందజేత**

**వేలేరు:**

వేలేరు మండల పరిధిలోని మల్లికుదుర్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1991-1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ పాఠశాల పట్ల ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు. ఇటీవల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ ఉపాధ్యాయులను, సహ విద్యార్థులను కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రస్తుత. ప్రధానోపాధ్యాయుడిని కలిసిన పూర్వ విద్యార్థులు, పాఠశాలకు అత్యవసరంగా అవసరమైన సదుపాయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. స్కూల్కు విద్యుత్ సరఫరా అయ్యే ప్రధాన విద్యుత్ వైర్లు



కాలిపోవడంతో పాఠశాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ప్రధానోపాధ్యాయుడు వారికి వివరించారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన పూర్వ విద్యార్థులు ఆలస్యం చేయకుండా విద్యుత్ సర్వీస్ వైర్లు కొనుగోలు చేసి అమర్చేలా చర్యలు చేపట్టారు. ఇందుకు సుమారు రూ.4,300 ఖర్చు చేసినట్లు తెలిపారు. దీంతో పాఠశాలలో మళ్లీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడింది. అదేవిధంగా, తాము చదువుకున్న పాఠశాలకు తమవంతు సహాయంగా ఐదు ఫ్యాన్లను బహుమతిగా అందజేశారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో చదువుకునే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు సంబంధించిన కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని 1991-1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. పాఠశాలకు ఏ అవసరం వచ్చినా ముందుండి సహాయం చేస్తామని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల ఈ సహాయంపై గ్రామస్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# శేషసాయి నగర్లో రూ.64 లక్షలతో అభివృద్ధి పనులు

**-అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించిన రజిత పరమేశ్వర్ రెడ్డి**

**-త్వరలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం**

**ఉప్పల్**

ఉప్పల్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ప్రతి కాలనీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం శేషసాయి నగర్ కాలనీలో విస్తృతంగా పర్యటించిన ఆమె రూ.64 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. శేషసాయి నగర్తో పాటు మల్లికార్జున్ నగర్ కాలనీల్లో సంవత్సరాలుగా నెలకొన్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఈ పనులు చేపట్టినట్లు రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. వర్షాకాలం వచ్చేసరికి మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేదని, కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో ఆ సమస్యలకు చెక్ పడుతుందని పేర్కొన్నారు. కాలనీల్లో పరిశుభ్రమైన



వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే రూ.64 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేస్తూ, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఉప్పల్లో ప్రతి కాలనీ అభివృద్ధే తమ ధ్యేయమని రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుని పనులు



చేపడుతున్నందుకు కాలనీ వాసులు రజిత పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో ఇబ్బందులు తప్పి, కాలనీలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శేషసాయి నగర్ కాలనీ అధ్యక్షుడు అచ్చన శ్రీనివాస్, నర్సయ్య, రాకేష్ నాయక్, మోహన్ రెడ్డి, వెంకటేశ్వరరావు,నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, సల్ల ప్రభాకర్ రెడ్డి, పూజారి హనుమంతు, వేణుగోపాల్ రెడ్డి, విప్లవ్ రెడ్డి, చారి, నవీన్, వంక మాధవ్, శ్రావణి, వంశీ, మౌనిక, అనుష, భాస్కర్, తుమ్మల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాలే కాదు, క్రీడల్లోనూ ప్రభుత్వం అండ: మల్రెడ్డి రామ్రెడ్డి

**-సరూర్నగర్లో 'ఉద్యోగ సాధన' కార్యక్రమం, 600 మంది క్రీడాకారులకు ఘన సన్మానం**

**రంగారెడ్డి :**

తెలంగాణ యువతకు ఉద్యోగాల కల్పనే కాకుండా క్రీడారంగంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సాహం ఇవ్వడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని రోడ్లు, భవనాల శాఖ చైర్మన్ మల్రెడ్డి రామ్రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 'యూత్ అండ్ స్పోర్ట్స్' వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'ఉద్యోగ సాధన -- ప్రతిభకు అవకాశాల కల్పన' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికితీస్తున్నాం. నేడు నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు నిబద్ధతతో పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలి. క్రీడాకారులు ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి" అని రామ్రెడ్డి ఆకాంక్షించారు. జిల్లాకు చెందిన 600 మందికి పైగా క్రీడాకారులు హాజరైన ఈ కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు ప్రజాప్రతినిధుల సమక్షంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. 2వ ఎడిషన్ సీఎం కప్--2025లో పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్లు, అధికారులను శాలువాలు, మెమెంటోలతో సత్కరిం











చారు. ఇంట్రామ్యూరల్ క్రీడా పోటీల విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, ఐఏఎస్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం. శ్రీలక్ష్మి, జిల్లా యువజన, క్రీడల అధికారి స్వర్ణలత, అదనపు డైరెక్టర్ శ్రీకాంత్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్లు, కళాశాల విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా, మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 10 ముఖ్య అంశాలపై నిర్వహిస్తున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా 'యూత్ అండ్ స్పోర్ట్స్' థీమ్ను మే 18 నుంచి 23 వరకు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు,

# కెటిఆర్,ఎమ్మెల్యే మాయమాటలకు మోసపోకండి..ఆత్మ విమర్శ చేసుకోండి

**-బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి పిలుపు**

**కూకట్ పల్లి :**



బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను మరోసారి మాయమాటలు చెప్పి మోసం చెయ్యడానికి కేటీఆర్, కూకట్పల్లి ఎమ్మెల్యే రంగం సిద్ధం చేస్తున్నారని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. 25 వ తేదీన కూకట్పల్లి ఎన్.కె.ఎన్.ఆర్. గార్డెన్ లో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం అందుకు నిదర్శనమని అన్నారు. గతంలో అనేక సందర్భాల్లో ముఖ్యంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఎన్నిక ముందు అనేక బహిరంగ సభల్లో తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇస్తామని కెటిఆర్ చెప్పిన మాటలు వాస్తవం కాదా అని గుర్తుచేశారు. కెటిఆర్ మాటలకు ఆహా..ఓహో..అంటూ వత్తాసు పలికిన ఎమ్మెల్యే కూడా అవే మాయమాటలు చెప్పి తెలంగాణ ఉద్యమంలో విరచిత పోరాటం చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకర్తలకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. పప్పులో కరివేపాకును వేసినట్లు ఎన్నికలు సమీపిస్తున్నాయంటే కార్యకర్తలను వాడుకుని వదిలెయ్యడమే కెటిఆర్, ఎమ్మెల్యే నైజం అని తీవ్రంగా విమర్శించారు. కార్యకర్తలను రెచ్చగొట్టడం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దిట్ట అని పేర్కొన్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మాధవరం కృష్ణారావు ఆయన, ఆయన కుమారుడు దినదినం అభివృధి చెందుతూ కోట్లకు పడగలెతారని, ఎమ్మెల్యేను నమ్ముకున్న కార్యకర్తలకు నామినేటెడ్ పదవులుగానీ, అభివృధి చెందిన దాఖలాలు గానీ ఎక్కడా లేవని

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
24 మే 2026

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు

**తిప్పర్తిలో ఘనంగా కేక్ కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు**



**మాడుగుల పల్లి :**
నల్గొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు ప్రజానేతగా మంత్రి కోమటిరెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముత్తినేని శ్యామ్సుందర్, ముఖ్య నాయకులు ఊట్కూరి సందీప్ రెడ్డి, వాడల సువర్ణ ప్రసాద్, ముత్తినేని సౌజన్య నాగేశ్వరావు, బొంత రాములు, కోన వెంకన్న, బోస్కా మల్లేష్, దాసరి జానయ్య, ఎస్ కే అలీ, నల్పరాజు శ్రీనివాస్, గుండు శ్రీను, లొడంకి వెంకటేశ్వర్లు, సోమరాజు, గుండెబోయిన సైదులు, ఒంగోలు గిరి, వంగూరు కిరణ్, గోవర్ధన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, వాడాల జానయ్య, కంభంపాటి కృష్ణ, దాసరి రవీందర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బోనం ఎత్తిన ఆడబిడ్డలు - గజ్జకట్టి ఆడిన పెద్దలు





**అన్నపురెడ్డిపల్లి :**
అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామంలో కురుమల ఆరాధ్య దైవం బీరప్ప, కామరతి దేవాలయం నూతన ఆలయం గత సంవత్సరం ఎంతో సుందరంగా నిర్మించుకుని ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేసి మహా జాతరను నిర్వహించారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం తొలి వార్షికోత్సవం శనివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం మామిడి తోరణాలు కట్టి అనంతరం అర్చకులు ఆలయంలో భక్తుల సమక్షంలో హోమం, అభిషేకం చేసారు. ప్రతి కురుమ ఇంటి నుండి ఆడబిడ్డలు బోనం ఎత్తుకొని ఆలయం దగ్గరకు వెళ్లి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. తరువాత మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి సుమారు 300 మందికి అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో దండి రాము, చింతల కేశవులు, సత్యం, సానిక శ్రీను, శు సి, చక్రధర్, ఎసుబాబు, సుధాకర్, అప్పయ్య, శ్రీను, సులోచన, రజిత, శ్రావణి, వెంకటకుమారి, సీత, నాగమణి, రంజిత, గణేష్, వెంకటనరసమ్మ, వెంకటేశ్వరావు, చెన్న కేశవలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి చేయూత



**శంకరపట్నం:**
మండల పరిధిలోని మొలంగూరు గ్రామానికి చెందిన మండల డీజే అండ్ లైటింగ్ యూనియన్ సభ్యులు అయినా తోటి కార్మికుని తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి డీజే యూనియన్ కలిసికట్టుగా కృషిచేసి తమ వంతు సహాయంగా 50 కేజీల బియ్యాన్ని అందజేసి 7500 రూపాయల నగదును అందించారు. ఆ కుటుంబానికి అండగా నిలిచిన యూనియన్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఎండి అసిముద్దీన్, జయంతి రావు కుమారు ప్రవీణ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఆల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత



**శంకరపట్నం :**
మండల కేంద్రం కేశవపట్నం గ్రామంలో శనివారం వివిఎన్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ వెలుగునీడా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మోరే గణేష్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ విద్య సంస్థలఅధినేత వి.నరేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సంద ర్భంగా నరేందర్ రెడ్డి క్రీడాకారుల పరిచయం చేసుకుని, కాసేపు బ్యాటింగ్ చేసి నిర్వాహకులను ఉత్సా హ పరిచి . మాట్లాడారు క్రీడలు మాన సిక ఉల్లాసానికి దోహద పడతాయని ఆయన పేర్కొన్నారు. వెలుగునీడ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు మోరే గణేష్ పలు సేవా కార్యక్రమాలతో పాటు క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలియపరిచారు. మాజీ జడ్పిటిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలకు హాజరై బర్త్డే విషెస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరే గణేష్ తో పాటు బండారి తిరుపతి గారు బసవయ్య గౌడ్ ఊకంటి మధుకర్ నేరెళ్ల సంతోష్ గాజుల మహేష్ రాయిని రమేష్ మనోచారి నిలవేణి మహేష్ దాసారపు శివ స్వామి కోరపెల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలి

- లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.ఎమ్మార్వో







**ఉప్పల్ :**
రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు ప్రయోజనాలు కల్పించాలని సూచించారు. మల్లాపూర్ వి.ఎన్.ఆర్ గార్డెన్లో ఉప్పల్ మండలానికి చెందిన 233 కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ ప్రయోజనాలను అందించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప్పల్ ఆర్ఐ ఎం.అశ్విని గౌడ్,జూనియర్ అసిస్టెంట్ లు ఎం,అనంత రాములు, పి.వెంకన్న,ఎం,అలివేలు,ఆపరేటర్ సునీత, అటెండర్స్ సత్యనారాయణ,విఆర్ఎ స్వామి,రెవెన్యూ సిబ్బంది, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాక్రోచెస్ జనతా పార్టీ" ఏర్పాటు దేశ యువత ఆవేదనకు ప్రతీక

- యువతను అవమానించిన అహంకార వ్యవస్థపై వ్యంగ్యాత్మక తిరుగుబాటు
- ప్రశ్నించే యువతను కించపరిచే పాలక-వ్యవస్థ ధోరణి ప్రమాదకరం
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర




**ఉప్పల్ :**
దేశ యువతను "బొద్దింకలతో" పోల్చిన అత్యున్నత న్యాయ వ్యవస్థకు చెందిన న్యాయమూర్తి సూర్య కాంత్ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయని, ఆ వ్యాఖ్యలపై యువతలో పెరిగిన నిరసన, ఆవేదనకు ప్రతీకగా "కాక్రోచెస్ జనతా పార్టీ" పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రారంభమైన వ్యంగ్యాత్మక ప్రతిస్పందన ఈ దేశ యువత మనోభావాలను స్పష్టంగా ప్రతిబింబిస్తోందని హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గత 12 సంవత్సరాలుగా ఏఐవైఎఫ్ చేస్తున్న ఉద్యమాల చైతన్య ప్రతిబింబమే జెన్ జీ పోరాటమన్నారు. ఇది కేవలం సోషల్ మీడియా ట్రెండ్ కాదని, నిరుద్యోగంతో నలిగిపోతున్న యువత ఆవేదన అని అన్నారు . ఇది పరీక్షల అవకతవకలతో విసిగిపోయిన విద్యార్థుల వ్యంగ్య నిరసన అని, అవకాశాలు లేక, అవమానాలు మాత్రమే ఎదుర్కొంటున్న తరం యొక్క ఆత్మగౌరవ పోరాటంగా వారు అభివర్ణించారు . దేశంలో కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం పోరాడుతుంటే, ప్రభుత్వ ఖాళీలు భర్తీ కాకపోతే, పేపర్ లీకులు భవిష్యత్తులను నాశనం చేస్తుంటే, వారి బాధలను అర్థం చేసుకోవాల్సిన వ్యవస్థ వారినే "బొద్దింకలు"గా చూడటం దురదృష్టకరమన్నారు . ఈ పరిస్థితుల్లో యువత వ్యంగ్య రూపంలో తమ నిరసనను వ్యక్తం చేయడం సహజ ప్రజాస్వామ్య స్పందనేనని వారు అన్నారు. యువతను అవమానించే ఈ వ్యాఖ్యలు ఒక వ్యక్తి మాటలు మాత్రమే కావని, అవి ఈ దేశంలో పెరుగుతున్న అధికార అహంకారానికి ప్రతిబింబమన్నారు . ప్రశ్నించే యువతను చిన్నచూపు చూడటం, నిరసన తెలిపే వారిని అవమానించడం, హక్కులు అడిగితే ఎగతాళి చేయడం, ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలుగా చూడాలన్నారు,ఈ దేశాన్ని నిర్మించేది కార్పొరేట్లు కాదు, కష్టపడే యువత అని అన్నారు. రైల్వే స్టేషన్లలో, కోచింగ్ సెంటర్లలో, నిరుద్యోగ ర్యాలీలలో కనిపించే యువతే ఈ దేశ భవిష్యత్తు. వారిని "కాక్రోచెస్"గా చూడటం అంటే భారత యువశక్తిని అవమానించడమే అని వారు అన్నారు.కాక్రోచెస్ జనతా పార్టీ సామాజిక మాధ్యమ ఖాతాలను నిలిపివేయడం తీవ్రంగా ఖండనీయమైన చర్య అన్నారు,ప్రజాస్వామ్యంలో వ్యంగ్యం, విమర్శ, నిరసన వ్యక్తీకరణ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) ప్రతి పౌరుడికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హామీ ఇస్తుందన్నారు . యువత తమపై జరిగిన అవమానానికి ప్రతిస్పందనగా సోషల్ మీడియా వేదికగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తే వాటిని అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు.ప్రశ్నించే గొంతులను బ్లాక్ చేయడం, వ్యంగ్యాన్ని కూడా భరించలేని స్థితికి వ్యవస్థలు చేరడం ప్రమాదకర పరిణామమని, ప్రజాస్వామ్యంలో అసమ్మతి స్వరం దేశద్రోహం కాదని . సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేయడం ద్వారా యువత ఆవేదనను అణచలేరన్నారు. కాబట్టి "కాక్రోచెస్ జనతా పార్టీ" సామాజిక మాధ్యమ ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని, భావ వ్యక్తీకరణ హక్కులపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని "కాక్రోచెస్ జనతా పార్టీ" రూపంలో వ్యక్తమవుతున్న వ్యంగ్య నిరసనను అణగదొక్కే ప్రయత్నాలు కాకుండా, యువత ఎందుకు ఈ స్థాయిలో ఆవేదన చెందుతున్నారో పాలకులు, వ్యవస్థలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు . ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం, న్యాయం అందించలేని వ్యవస్థ, భవిష్యత్తుపై భరోసా కల్పించలేని పాలకులు, ఇప్పుడు యువత గౌరవాన్నే అవమానించే స్థితికి దిగజారడం దేశానికి మంచిది కాదని, దేశ యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఇటువంటి అవమానకర వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని AIYF డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, యుగంధర్ పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం సీతంపేట-రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ

- రూ.4.75కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నాం
- నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం
- రూ.34లక్షలతో రెడ్డిపాలెం సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం
- రూ.45లక్షలతో నిర్మించిన ఎంఆర్సి భవనం అందుబాటులోకి వచ్చింది
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజల చెంతనే ఉంటాం
- రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో పల్లెల రూపురేఖలు మారుస్తాం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- సుజాతనగర్ మండలంలో శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు





**సుజాతనగర్– ;**
సీతంపేట–రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేరుస్తున్నామని, బ్రిడ్జి నిర్మాణం ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించడం జరిగిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలో రూ. 5.54 కోట్ల నిధులకు సంబంధించి శనివారం అయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ రూ. 4.75 కోట్ల భారీ అంచనా వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే రూ. 34 లక్షలతో రెడ్డిపాలెం సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రూ. 45 లక్షలతో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఎంఆర్సి భవనాన్ని కూడా ఈ రోజు ప్రారంభించడం సంతోషంగా ఉందని, మండలంలో విద్యాసంబంధిత సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయన్నారు. వేపలగడ్డ స్మశానవాటికలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రెండు బోర్లు మంజూరు చేయడం జరిగిందని, వాటి శంకుస్థాపన పూర్తేచేశామన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను మంజూరు చేయించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, తహసీల్దార్ వి వరప్రసాద్, ఎంపిడివో భారతి, ఆరడబ్ల్యూఎస్ ఏఈ గుప్తా, విద్యుత్ ఏఈ జి కిషన్, ఏడిఈ రవికుమార్, సిఐ వెంకటేశ్వర్, పిఆర్ ఏఈ రాజు, డిఈ నాగేందర్, ఎంఈ ఓ లీలా, ఎస్ఐ రమాదేవి, హన్మంతరావు, వ్యవసాయశాఖ అధికారి నర్మద, స్థానిక నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఉపేందర్, భూక్యా శ్రీనివాస్, గుమ్మడిల్లి దర్గయ్య, బొడ్డు కేశవరావు, గారికే ఉపేందర్, నరేష్, ముక్కెర మురళి, దండు సురేష్, లావుడియా గోపి తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co